"నువ్వు ఎవరికీ కనపడనంత లోతు గుంతలో పడలేదు. అదృష్టం." ఆశావాది చెప్పాడు.

గోతిలోని ఆ మనిషిని చూసి అటుగా వెళ్తున్న శ్రీరామ చంద్రుడు అనే అతను 'అయ్యో!' అని అందరినీ పిలిచి వారి సహాయంతో ఆ మనిషిని గోతిలోంచి బయటకి తీసాడు.

నీతి: మనని కష్టాల్లో ఆదుకునేది ఒక్క భగవంతుడే. ఆ పనిని తరచు సాటి మనుషుల ద్వారా చేయిస్తూంటాడు.

## 73. దైవ సహాయం

హిమాలయాల్లోని కేదార్‌నాథ్ దేవాలయం మే నించి అక్టోబర్ దాకా ఆరు నెలలు తెరుస్తారు. అక్టోబర్ నించి మళ్ళీ మే దాకా అక్కడ కురిసే మంచు వల్ల మూసేస్తారు. ఓ భక్తుడు అక్టోబర్‌లో ఓ రోజు కేదార్‌నాథ్‌కి చేరుకున్నాడు. ఆ రోజే గుడిని మూసేరోజు అని అతనికి అక్కడికి వచ్చే దాకా తెలీదు. ఇంకో గంటలో గుడి మూసేస్తారని తెలిసి, భోజనం కూడా చేయకుండా కేదార్‌నాథ్ శివలింగాన్ని దర్శించాలన్న తపనతో అతను ఆలయ ప్రధాన ద్వారం దగ్గరకి చేరుకున్నాడు. ఐతే అప్పటికే ఆలయ ద్వారాన్ని పూజారి మూసేసాడు.

"స్వామీ! ఒక్కసారి సింహద్వారం తెరిస్తే కేదారేశ్వర్‌ని దర్శించుకుని వెళ్ళిపోతాను." కోరాడతను.

పూజారి ఇక తలుపు తీయనన్నాడు.

"చాలా దూరం నించి వచ్చాను స్వామి. దయచేయండి." దీనంగా అడిగాడా భక్తుడు.

పూజారికి కనికరం లేకపోయింది. ఆలయ ద్వారానికి తాళం వేసి వెళ్ళిపోయాడు. ఆరు నెలల తర్వాత మే నెల్లో పూజారి ఆలయాన్ని తెరవడానికి వస్తే, ఆ భక్తుడు అక్కడే ఇంకా నిలబడి తన కోసం ఎదురు చూస్తూండటం గమనించి ఆశ్చర్యంగా అడిగాడు.

"అదేమిటి? నువ్వింకా వెళ్ళలేదా?"

"లేదు స్వామీ! మీరెళ్ళాక నేను విలపిస్తూంటే ఓ సన్యాసి వచ్చి 'ఒక్క గంట ఓపిక పట్టు. పూజారి వచ్చి మళ్ళీ ఆలయం తలుపు తీస్తాడు. దైవ దర్శనం చేసుకుని వెళ్ళు.' అని చెప్పి చలికి మంట వేసి వెళ్ళిపోయాడు. అతను చెప్పినట్లుగానే మీరు వచ్చారు." చెప్పాడా భక్తుడు.

తన నిజమైన భక్తులకి కేదారేశ్వరుడు ఆర్నెల్లని ఓ గంటలా గడిపేలా చేయడంలో పెద్ద విశేషం ఏమీ లేదు.

## 74. గీతా ప్రభావం

నిత్యం భగవద్గీతని పారాయణం చేసే ఆచారం గల ఓ ఇంటి పక్కన వున్న ఇంటికి అలాంటి ఆచారం లేని ఓ అమ్మాయి కోడలుగా వచ్చింది. ఆమెకి ఇద్దరు పిల్లలు కలిగారు. వాళ్ళకి ఆరో ఏడు రాగానే తన పిల్లల చేత గీతా పారాయణం చేయించాలనే తలంపు ఆమెకి కలిగింది. కాని పెద్దయ్యాక వాళ్ళు ఇల్లు విడిచి సన్యసిస్తారేమోనన్న ఓ భయం వల్ల ఆమె ఆ పని చేయలేదు.

ఓ సారి పక్క ఇంటికి ఓ మఠాధికారి భిక్షకి వచ్చాడు. సమయం చూసి ఆమె అతన్ని అడిగింది.

"స్వామి! నా పిల్లలు కూడా గీత చదివితే లోకం మీద విరక్తి కలిగి, పెద్దయ్యాక సన్యాసుల్లో కలిసిపోతారేమోనని భయంగా వుంది. అలా జరిగే అవకాశం వుందా?"

అందుకాయన నవ్వి జవాబు చెప్పాడు.

"పిచ్చిదానా! గీతా పారాయణం వల్లనే ప్రపంచం మీద విరక్తి, వైరాగ్యాలు కలిగే పక్షంలో ప్రపంచం ఎంతో బాగుపడేది. ఆ భయం వద్దు."

"కాని స్వామి..."

"మోహ కారణంగా అర్జునుడు తన క్షాత్ర ధర్మాన్ని విడిచిపెట్టి బిచ్చమెత్తుకుని జీవించడానికైనా సిద్ధపడ్డాడు. అప్పుడు సాక్షాత్తు పరమాత్మే ముఖాముఖీ అర్జునుడికి గీతా బోధ చేసాడు. అవునా?" ప్రశ్నించాడాయన.

"అవును స్వామి." ఒప్పుకుందామె.